సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 26 । జనవరి । 2025



తగ్గిన చీనీ ధర

చీనీ ధర తగ్గింది. శనివారం అనంతపురం మార్కెట్‌యార్డులో టన్ను గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.12 వేలు మాత్రమే ధర పలికింది.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.4°/9.2°

జిల్లాలో శనివారం చలివాతావరణం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గగా... పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రమోద్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

- ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం అర్బన్: ఓటరు నమోదులో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు దక్కింది. శనివారం విజయవాడలో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారులు అవార్డు అందజేసి సత్కరించారు. కమిషనర్‌కు అవార్డు రావడంపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు

హిందూపురం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. రైతులు ఆదివారం మార్కెట్‌కు పట్టుగూళ్లు తీసుకురావొద్దని మార్కెట్ అధికారి లక్ష్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచీ యథావిధిగా మార్కెట్ కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు.

విమానాశ్రయంలో మెరుగైన భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: అన్ని శాఖల సమన్వయంతో సత్యసాయి విమానాశ్రయంలో మెరుగైన భద్రత కల్పిద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం సత్యసాయి విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్ భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ హోదాలో కలెక్టర్ చేతన్ హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం వీఐపీలు, వీవీఐపీలు చాలామంది పుట్టపర్తి విమానాశ్రయం వస్తుంటారని, అలాటి సమయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వ అధికారులకు విమానాశ్రయం నిర్వాహకుల సహకారం ఉండాలన్నారు. అనంతరం వియానాశ్రయం నిర్వాహకులు ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, గ్రూప్ కమాండ్ డైరెక్టర్ వీరరాఘవ, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్, పుట్టపర్తి మన్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

నదుల కోత...ఇసుక మేత



పెనుకొండ మీదుగా కర్ణాటకకు అక్రమంగా ఇసుకను తీసుకున్న ట్రాక్టర్ ఇది. ఇలాంటి ట్రాక్టర్లు రోజుకు సుమారు 120 వరకు ఇసుకతో సరిహద్దు దాటుతున్నాయి. పెన్నా, చిత్రావతి నదుల నుంచి ఇసుక తవ్వి కర్ణాటకలోని పావగడ, దొమ్మతిమర్రిలో ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల వరకు విక్రయిస్తూ రోజు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. అక్రమ రవాణా అంతా 'తమ్ముళ్లు' కనుసన్నల్లోనే సాగుతోంది. వీరికి 'అక్క' అండదండలు ఉండటంతో పెనుకొండ నియోజకవర్గంలో ఇసుక దందా రాత్రింబవళ్లు కొనసాగుతోంది.

ఇది ముదిగుబ్బ మండల కేంద్రంలో కనిపించిన ఇసుక ట్రాక్టర్. పీసీ రేవు, సీసీ రేవు వద్ద రీచ్‌లు ఉన్నప్పటికీ.. ముదిగుబ్బ మండల వ్యాప్తంగా చాలా చోట్ల ప్రైవేటు భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టారు. హిటాచీలతో ఇష్టానుసారం తోడేస్తున్నారు. అయినా అడిగే నాథుడు కరువయ్యాడు. మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా కూటమి నేతలు... అక్రమ మార్గంలో రూ.కోట్లు సంపాదిస్తున్నారు.





చిలమత్తూరు మండలంలో చిత్రావతి నదిలో ఇసుక తోడేస్తున్న దృశ్యం

తెలుగు తమ్ముళ్లు ఆదాయం కోసం 'అక్రమ' బాట పట్టారు. చిత్రావతిని చిత్రవధ చేస్తున్నారు. జయమంగళిని గుల్ల చేస్తున్నారు. పెన్నా గర్భాన్ని జేసీబీలతో తవ్వేస్తున్నారు. ఇసుకను పిండి తైలం తీస్తున్నారు. అధికారం అండతో సరిహద్దు దాటించి భారీగా ఆర్జిస్తున్నారు. రోజుకు రూ.కోట్లు కూడబెడుతున్నారు. ఫలితంగా నదుల రూపురేఖలు కోల్పోతున్నాయి. భూగర్భజల మట్టం తగ్గి తాగు, సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి.

జిల్లాలో ఇసుక తోడేళ్లు!

- విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
- ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్న వైనం
- జిల్లాలోని ఇతర ప్రాంతాలకూ ఇసుక సరఫరా
- రూ.కోట్లు సంపాదిస్తోన్న కూటమి నేతలు

సాక్షి, పుట్టపర్తి

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పర్యవేక్షించే వారు లేక.. నియంత్రించాల్సిన వ్యవస్థ నిద్రావస్థలో ఉండటంతో.. ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చిత్రావతి, కుముద్వతి, జయమంగళి నదుల్లో జేసీబీ యంత్రాలతో ఇసుకను తోడి.. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పొరుగు రాష్ట్రం కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనధికారికంగా తవ్వకాలు

జిల్లాలో అధికారికంగా రెండు ఇసుక రీచ్‌లు మాత్రమే ఉన్నాయి. అయితే అనధికారికంగా సుమారు 20పైగా ఇసుక తవ్వే ప్రాంతాలు ఉన్నట్లు తెలుస్తోంది. చీకటి పడగానే కూటమి నేతలు జేసీబీలను నదుల్లో దింపుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తోడేసి రాత్రికి రాత్రే టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా బెంగళూరుకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్కడ టిప్పర్ ఇసుకను (18 టన్నులు) రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇక జిల్లాలో అయితే దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. 10 కి.మీ దూరం ఉంటే చాలు ట్రాక్టర్‌కు అన్నీ ఖర్చులు పోను రూ.1,000 ఆదాయం వచ్చేలా చూసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ రోజుకు కనీసంగా 10 ట్రిప్పులు తిప్పుతున్నారు. ఇక 18 టన్నుల టిప్పర్ ఇసుకను స్థానికంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ విక్రయిస్తున్నారు. ఇందులోనూ ఒక్కో లోడుకు రూ.5 వేలకు పైగా మిగులుతోంది.

చిత్ర'వ్యథ'

ఇసుకాసురులకు కాసులకోసం చిత్రావతిని చిత్రవధ చేస్తున్నారు. చిలమత్తూరు, గోరంట్ల, పుట్టపర్తి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో జేసీబీలతో నదిని తవ్వేస్తున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను తవ్వేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇందుకోసం కర్ణాటక సరిహద్దు వరకు 'మామూళ్లు' ఇచ్చుకుంటూ వెళ్తుండటంతో అడ్డుకునే వారు కరువయ్యారు. ఫలితంగా ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల నుంచి కర్ణాటకకు భారీగా ఇసుక తరలిపోతోంది.

మంత్రి అండదండలతోనే?

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గంలో పెన్నా, జయమంగళి నదుల నుంచి ఇసుక భారీగా తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే టీడీపీ నేతలు రొద్దం, పరిగి మండలాల నుంచి కర్ణాటకకు ఇసుక తరలించే వ్యాపారం మొదలుపెట్టారనే ఆరోపణలున్నాయి. మంత్రి మనుషులమంటూ దర్జాగా దందా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులందరూ మంత్రి చెప్పుచేతుల్లో ఉండటంతో ఇసుక దందాకు అడ్డు అదుపూ లేకుండా పోయింది.

హిందూపురం మీదుగా రవాణా

జిల్లాలో ఏ ప్రాంతంలో ఇసుక తవ్వినా హిందూపురం నియోజకవర్గం మీదుగా కర్ణాటక చేరుతోంది. కొడికొండ చెక్‌పోస్టు, తూముకుంట చెక్‌పోస్టులు దాటుకునే.. ఇసుక కర్ణాటక తరలిస్తున్నారు. ఇసుక వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో వెళ్తున్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది.

రవాణా భారం భరించలేక 'బ్లాక్'లో కొనుగోలు

జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. అయితే అక్కడ నుంచి అమరాపురం వెళ్లాలంటే రవాణా ఖర్చులే తడిసి మోపెడవుతున్నాయి. దీంతో అక్కడి వారంతా స్థానికంగా బ్లాక్‌లో దొరికే ఇసుకను కొనేందుకు ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు ఇసుక అక్రమ రవాణానే ఆదాయ వనరుగా మార్చుకుని వ్యాపారం చేస్తున్నారు. కొందరు నేతలు ధర్మవరం పరిధిలో రీచ్‌లో అధికారికంగా ఇసుక తవ్వుకుని బెంగళూరుకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలో ఎవరైనా అడ్డుకుంటే 'మామూళ్లు' ముట్టజెపుతున్నారు.

స్థానికంగా ఇసుక అక్రమ రవాణా, ఆదాయం ఇలా...

ట్రాక్టరు : 4 టన్నులు | టిప్పరు : 18 టన్నులు

రోజుకు సగటున : 200 ట్రాక్టర్లు, 150 టిప్పర్లు

ట్రాక్టరు ఇసుక ఆదాయం (ఖర్చులుపోను) : రూ.1,000

ఒక్కో టిప్పర్ ఇసుక ద్వారా ఆదాయం: రూ.5,000

ట్రాక్టర్ల ద్వారా ఒక్కరోజు ఆదాయం: రూ.2 లక్షలు

టిప్పర్ల ద్వారా రోజుకు : రూ.7 లక్షలుపైనే

బెంగళూరులో మాత్రం టిప్పర్ ఇసుకను రూ.50 వేలకు పైగానే విక్రయిస్తున్నారు



హిందూపురం పట్టణంలో పట్టపగలే ట్రాక్టరులో ఇసుక అక్రమ రవాణా

ఓటు ప్రజల చేతుల్లో వజ్రాయుధం

- 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు

ప్రశాంతి నిలయం: ''ఓటు ప్రజల చేతుల్లో వజ్రాయుధం. దాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకుని మంచి నేతలను ఎన్నుకోవాలి. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ కలెక్టరేట్ ఉద్యోగులతో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పౌరులకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసి, వారి బాధ్యతను గుర్తు చేస్తూ స్ఫూర్తిని కలిగించేందుకు ఏటా జనవరి 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటరు మాత్రమేనని, అందువల్ల ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ క్రమంలోనే ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి ఉద్యోగులు పాల్గొన్నారు.





జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు (ఇన్‌సెట్‌లో) ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఫిట్‌నెస్ పరీక్ష మళ్లీ ప్రైవేటుకే

- ఏజెన్సీల చేతుల్లోకి వాహన ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో వాహన ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ మళ్లీ ప్రైవేటు ఏజెన్సీ చేతుల్లోకి వెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను గతంలోనే ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. జిల్లాలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ రాప్తాడు సమీపంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. కొన్ని నెలల పాటు కార్యకలాపాలు కొనసాగాయి. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఏజెన్సీల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలుస్తోంది. సోమవారం నుంచి అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో కాకుండా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలోని శివశంకర్ ఎంటర్ ప్రైజెస్‌లోనే ఫిట్‌నెస్ పరీక్షలు జరగనున్నాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు.



అనంతపురంలోని ఆర్టీఏ కార్యాలయం

వాహనదారులకు ఇబ్బందులు..

ఫిట్‌నెస్ పరీక్షలపై కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యలు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సోమవారం నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు జరగవని ఆర్టీఏ అధికారులు శనివారం ఉన్నట్లుండి ప్రకటించారు. అయితే చాలా మంది అప్పటికే స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వారి పరిస్థితి ఏంటని ఉప రవాణా కమిషనర్ వీర్రాజును వివరణ కోరగా.. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వాహనదారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే రూ. వేలల్లో నష్టపోవాల్సి వస్తుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వం నీవే సాయీ

- అలరించిన 'ప్రేమ్‌కి పరిభాష' కచేరీ



సత్యసాయిని కీర్తిస్తూ గానం చేస్తున్న యూత్ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహా సమాధి

ప్రశాంతి నిలయం: సర్వం, సత్యం నీవే సాయీ అంటూ యువత సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన కచేరీ భక్తులను అలరించింది. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న జాతీయ నాయకత్వ లక్షణాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన సత్యసాయి యువత శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత కచేరీ నిర్వహించారు. 'ప్రేమ్‌కి పరిభాష' పేరుతో సత్యసాయి ప్రేమ, సేవా తత్వాన్ని వివరిస్తూ వారు నిర్వహించిన కచేరీ అందరినీ ఆధ్యాత్మిక సాగరంలోకి తీసుకెళ్లింది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

గణతంత్రం.. ఏర్పాట్లు ఘనం

- నేడు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉత్తమ సేవలందించిన 561 మంది అవార్డులకు ఎంపిక

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ఘనంగా చేసింది. వేడుకలు నిర్వహించనున్న శిరసాని హిల్స్‌లోని పోలీసు పరేడ్ మైదానాన్ని అధికారులు అందంగా తీర్చిదిద్దారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న రిహార్సల్స్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు, సలహాలిచ్చారు. పోలీసుల కవాతు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్దిష్ట సమయం ప్రకారం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సీఐ సునీత, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిహార్సల్స్‌లో గౌరవవందరం స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నేటి కార్యక్రమ షెడ్యూల్ ఇలా...

- ఆదివారం ఉదయం 8.30 గంటలకు గణతంత్ర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఎస్పీ వి.రత్న 8.55 గంటలకు పరేడ్ మైదానం చేరుకుని కలెక్టర్ చేతన్‌కు స్వాగతం పలుకుతారు. 9.05 గంటలకు కలెక్టర్ టీఎస్ చేతన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.
- 9.10 గంటలకు సాయుధ దళాల పరిశీలన, గౌరవ వందనం స్వీకరిస్తారు.
- 9.15 గంటలకు జిల్లా ప్రగతి నివేదిక, గణతంత్ర దినోత్సవ సందేశం ఇస్తారు.
- 9.35 గంటలకు సాయుధ దళాల కవాతు ఉంటుంది.
- 9.50 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పుర ప్రజలు, ఆహ్వానితులను కలిసి కలెక్టర్ అభినందలు తెలియజేస్తారు.
- 9.55 గంటలకు ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై శకటాల ప్రదర్శన.
- 10,40 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.
- 11.10 గంటలకు ఉత్తమ సేవలు అందించిన 43 మంది జిల్లా అధికారులు, 518 మంది పలు శాఖల అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు.
- 11.55 గంటలకు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శిస్తారు. అనంతరం జాతీయ గీతాలాపనతో వేడుకలను ముగుస్తాయి.

క్లుప్తంగా

అదుపుతప్పి ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం


రామకృష్ణ (ఫైల్)

బత్తలపల్లి: అకస్మాత్తుగా వచ్చిన కుక్కలను తప్పించే క్రమంలో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోట్లమర్రి గ్రామానికి చెందిన కురుబ రామకృష్ణ (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. శుక్రవారం వ్యక్తిగత పనిమీద బత్తలపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలోని శ్మశానం వద్ద ఉన్నపళంగా కుక్కలు రోడ్డుపైకి దూసుకురావడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రామకృష్ణకు భార్య శివమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో మూడు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏడుగురు క్రయవిక్రయదారులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం రాప్తాడులోని అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి, అనంతపురం, తాడిపత్రికి చెందిన పూల సునీల్ కుమార్, మండ్ల కుళ్లాయప్ప, పోకల విజయ్ కుమార్ శనివారం గంజాయిని విక్రయించేందుకు ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపానికి చేరుకున్నారు. వీరి వద్ద అనంతపురం, రూరల్ మండలం కాటిగానికాలువ, కదిరికి చెందిన యర్రగుంట చంద్రకాంతరెడ్డి, బండారు శివప్రసాద్, బెస్త భానుప్రకాష్, గొల్ల క్రాంతికుమార్ కొంటుండగా రాప్తాడు సీఐ టీవీ. శ్రీహర్ష తన సిబ్బందితో వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురినీ రిమాండ్‌కు తరలించారు. సీఐ, సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ అభినందించారు.

ఇంటికెళదాం పదవయ్యో..!

ఆ శునకం తన యజమాని ఇంట ఉన్న బర్రె పిల్లతో కలిసి వీధిలో అలా బయటకు వచ్చింది. కాసేపటి తర్వాత తిరిగి ఇంటికి వెళదాం పదా అంటూ బర్రె పిల్ల మెడలో ఉన్న పలుపు తాడును నోట కరచుకుని లాగడం కనిపించింది. బర్రెపిల్ల మొరాయిస్తుంటే శునకం మాత్రం తాడును లాగుతూ ఇంటిబాట పట్టింది. ఈ దృశ్యం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లి గ్రామంలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

– పుట్టపర్తి రూరల్:


ఇంటికి వెళ్దాం రా..


ఇంకాసేపు ఆగు.. పోదాం..

కుక్కల దాడిలో జింకకు తీవ్ర గాయాలు


జింకను అటవీశాఖ సిబ్బందికి అప్పగిస్తున్న నవీన్‌కుమార్

రొళ్ల: కుక్కల దాడిలో జింక తీవ్రంగా గాయపడింది. శనివారం అటవీ ప్రాంతం నుంచి ఆహారం కోసం జింక హెచ్‌ఎం పల్లి పొలిమేర వద్దకు వచ్చింది. కుక్కలు గమనించి జింకను తరిమే క్రమంలో తీవ్రంగా గాయపరిచాయి. అటుగా పొలం వైపు వెళ్తున్న నవీన్‌కుమార్ అనే యువకుడు జింకను రక్షించి ద్విచక్రవాహనంపై రొళ్ల పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. తర్వాత సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జింకను మెరుగైన వైద్యం కోసం మడకశిర పశువైద్యశాలకు తరలించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బందికి జింకను అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై అక్రమ కేసు

గోరంట్ల: ఫిర్యాదులో పేరు ప్రస్తావన లేకపోయినా వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ పెయ్యాల శివారెడ్డిపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. నార్శింపల్లికి చెందిన ఓ మైనర్ అమ్మాయిని అదేగ్రామానికి చెందిన అబ్బాయి వారం క్రితం తీసుకెళ్లిపోయాడు. అమ్మాయి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారిని వెతికి పట్టుకొచ్చారు. ఈ సందర్భంగా అబ్బాయిపై అమ్మాయి బంధువులతో పాటు గ్రామస్తులు కొందరు స్తంభానికి కట్టేసి కొట్టి అవమానించారు. ఈ ఘటనపై అబ్బాయి తరపు వారు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ రత్న గురువారం పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో విచారణ చేపట్టి ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. బాధితుడు తనపై ఏడుగురు దాడిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో పెయ్యాల శివారెడ్డి పేరు పొందుపరచలేదు. విచారణ తర్వాత శివారెడ్డిని నిందితునిగా చేర్చారు. శుక్రవారం రాత్రే ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేత ఒత్తిడి మేరకే వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డిని కేసులో ఇరికించారని మండల నాయకులు ఆరోపించారు.

50 గొర్రె పిల్లల మృతి

శింగనమల: గుర్తు తెలియని జంతువుల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శింగనమలలోని కొండ సమీపాన కాపరి కాయల చలపతి తన గొర్రెల మంద కోసం దొడ్డి వేసుకొన్నారు. శుక్రవారం గొర్రెలను మేపునకు తోలుకొని వెళుతూ పిల్లలను దొడ్డి వద్దే ఉంచాడు. సాయంత్రం వచ్చి చూడగా గుర్తు తెలియని జంతువుల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. దీనితో శనివారం శింగనమల పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభం, ఫారెస్ట్ సిబ్బంది తేజేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ పరిశీలించారు. గొర్రెల దొడ్డిని, చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. గొర్రెల కాపర్లతో ఆరా తీశారు. గుర్తు తెలియని జంతువులు దాడి చేసినట్లు వివరించారు. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కాపర్లు తెలిపారు. కొండ ప్రాంతంలో చిరుతపులులు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం నిర్వహించి, మృతికి గల కారణాలను నిర్ధారిస్తామని వైద్యులు, ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం


హైకోర్టు జడ్జికి పూలమొక్కను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం సెంట్రల్: ఏపీ హైకోర్టు, అనంతపురం అడ్మినిస్ట్రేషన్ జడ్జి కె.శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాకు వచ్చారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఆయనకు జిల్లా జడ్జి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఘనంగా స్వాగతం పలికారు. అలాగే కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, సీనియర్ న్యాయవాది బి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు హైకోర్టు జడ్జిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి టౌన్: భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పట్టణంలోని అడపాలవీధికి చెందిన భారత కవిజ్యోతి శనివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కవిజ్యోతికి 2019లో కడపలో అల్మాస్ పేట నివాసి అయిన పానేటి ఆంజనేయులు కుమారుడు శ్రీనివాసులుతో పెళ్లి జరిగింది. కట్నం కింద 9 తులాల బంగారు, రూ.3 లక్షల నగదు, బుల్లెట్ బైక్ ఇచ్చారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. ఆ తర్వాత కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు వేధిస్తుండడంతో ఆమె నెల కిందట కదిరికి వచ్చేసింది. అయినా ఫోన్ చేసి మరీ వేధిస్తుండడంతో భరించలేకపోయిన కవిజ్యోతి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

వివాహిత బలవన్మరణం

హిందూపురం అర్బన్: మరవపల్లిలో శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రమ్య (21) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. నింకంపల్లికి చెందిన రమ్యకు మూడేళ్ల క్రితం పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరు కొంతకాలంగా మరవపల్లిలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరు ప్రతి చిన్నవిషయానికీ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రమ్య శుక్రవారం రాత్రి ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. శనివారం హిందూపురం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రమ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె అత్త, ఆడపడుచుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జయరాంరెడ్డి తెలిపారు.

వీడిన హత్య మిస్టరీ

- అల్లుడే నిందితుడు
- మామతో మనస్పర్థలే కారణం


నిందితుడిని మీడియాకు చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: ఓబుళాపురం సమీపాన జరిగిన వ్యక్తి హత్య మిస్టరీని పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. మామతో ఉన్న మనస్పర్థల నేపథ్యంలో అల్లుడే కడతేర్చినట్లు తేల్చారు. చాకచక్యంగా నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాయదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలిసి డీఎస్పీ రవిబాబు మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రలోని మిరాజ్ పట్టణానికి చెందిన బోస్లే సంచార జీవనంలో భాగంగా నెల కిందట భార్య, పిల్లలతో కలిసి డీ హీరేహాళ్ మండలం ఓబుళాపురం చేరుకున్నాడు. శివారులో గుడారం వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాస్టిక్ గృహోపకరణాలు విక్రయిస్తూ రాత్రి వేళకంతా గుడారం వద్దకు చేరేవాడు. పెద్ద కుమార్తె భారతికి బళ్లారి జిల్లా సంగనకల్‌కు చెందిన శ్రీనాయక్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశాడు. వీరుకూడా ఓబుళాపురంలోనే ఉంటూ సంచార జీవనం సాగిస్తున్నారు. వివాహ సమయంలో కట్న కానుకలు ఏమీ ఇవ్వలేదు. అవసరాల నిమిత్తం ఇటీవల రూ.80 వేలు అల్లుడితోనే బోస్లే అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బు రికవరీ విషయంలో మామ, అల్లుడి మధ్య వివాదం మొదలైంది. డబ్బు ఇవ్వకపోగా.. తన కూతురిని మరొకరికి ఇచ్చి పెళ్లి చేస్తానని, నీవు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అల్లుడిపై విరుచుకుపడ్డాడు. తన సంసారాన్ని నాశనం చేసేలా ఉన్నాడని భావించిన అల్లుడు.. మామను మట్టుబెట్టాలని పథకం రచించాడు. అదును కోసం ఎదురుచూస్తూ వచ్చాడు. అందులో భాగంగా ఈ నెల 21న అర్ధరాత్రి మారణాయుధాలతో బోస్లేని నరికి చంపాడు. మృతదేహాన్ని దూరంగా పడేసి పరారయ్యాడు. హత్య ఘటనపై వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ రంగంలోకి దిగారు. అల్లుడిపై అనుమానం రావడంతో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అతడిని శనివారం ఓబుళాపురం చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో మామను చంపింది తనేనని శ్రీనాయక్ ఒప్పుకున్నాడు. నాలుగు రోజుల వ్యవధిలోనే హత్య మిస్టరీని ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి
- సీపీఐ నాయకుల డిమాండ్


విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ నేతలు

బత్తలపల్లి: అనంతపురం శివారులోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి చరణ్ కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బత్తలపల్లిలో చరణ్ కుటుంబ సభ్యులను సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఏఐటీయూసీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడు తదితరులు పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ వేధింపుల కారణంగా విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడని, బాధిత కుటుంబానికి ప్రభుత్వంతో పాటు విద్యాసంస్థల అధినేత తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. కళాశాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వీరి వెంట ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుళ్లాయిస్వామి, సత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు వంశీ, మంజునాథ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, గౌతంమూర్తి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్, రామకృష్ణయ్య, ఎన్వీ రమణ తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ


క్లూస్‌టీంతో పరిశీలిస్తున్న సీఐ సత్యబాబు, పోలీసు సిబ్బంది

యల్లనూరు: మండల కేంద్రం యల్లనూరులో దొంగలు చెలరేగిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి వేళ ఎస్సీ కాలనీకి చెందిన పుల్లమ్మ, ప్రహల్లాద్, ఎన్కే కాల్వ రోడ్డులో నివాసం ఉంటున్న కొత్తమిద్దె మనోహర్ ఇంట్లో చోరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పుట్లూరు సీఐ సత్యబాబు శనివారం మీడియాకు వెల్లడించారు. పుల్లమ్మ ఒంటరిగా ఉండటంతో ఇంటికి తాళం వేసి సమీపంలోని చెల్లి ఇంట్లో రాత్రి పూట నిద్రించేది. ప్రహ్లాద పులివెందులలో ఓ ఇంట్లో కాపలాదారుగా పనిచేస్తున్నాడు. ఎన్కే కాల్వ రోడ్డులో ఉండే మనోహర్ కూలి పని నిమిత్తం వెళ్లాడు. మూడు గృహాలకు తాళాలు వేసి ఉండడం గమనించిన దుండగులు అర్ధరాత్రి వేళ చొరబడ్డారు. బీరువాలోని బంగారు వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహులు, ఏఎస్ఐ నారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నారాయణ, క్లూస్ టీం శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం దుకాణానికి జరిమానా

లేపాక్షి: మండల కేంద్రంలోని మద్యం దుకాణంపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండటం గుర్తించి రూ.5 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందనాయక్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సాయి పల్లకీ ఉత్సవం



పుట్టపర్తి రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన సత్యసాయి భక్తులు పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్నారు. శనివారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమాన్ సర్కిల్ వద్ద ప్రత్యేకకంగా అలంకరించిన పల్లకీలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. భజనలు, భక్తి గీతాలు ఆలపిస్తూ వీధులగుండా ఈశాన్య గోపురం మీదుగా గణేష్ గేట్ ప్రశాంతి నిలయం ద్వారం వరకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

ఆంత్రాక్స్‌తో 15 గొర్రెలు మృత్యువాత

కంబదూరు: రాళ్ల అనంతపురంలో ఆంత్రాక్స్ వ్యాధితో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత గొర్రెల కాపరులు మల్లప్ప, ఈరన్న తెలిపారు. మృతి చెందిన గొర్రెలను పశు సంవర్ధక శాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెల మృతితో రోడ్డునపడ్డ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ లక్ష్మిదేవమ్మ, గ్రామస్తులు కోరారు.

లీజు ధరలో తిరకాసు

- విండ్ పవర్ కంపెనీల ఇష్టారాజ్యం
- ఒక్కో పంచాయతీలో ఒక్కో రకంగా ధర
- పంచాయతీల తీర్మానం లేకనే భూ సేకరణ
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నిబంధనల ఉల్లంఘన



కళ్యాణదుర్గం: పవన విద్యుత్తు తయారీ కోసం గాలిమరలు ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. అవసరమైన భూముల సేకరణ.. లీజు ధరల ఖరారులో తకరారు చేస్తున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరతో భూములు లీజుకు తీసుకుని లబ్ధి పొందేందుకు ఎత్తుగడ వేస్తున్నాయి. గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండానే తమ పని కానిస్తుండడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రెవెన్యూ, ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్ అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులూ వెలువడక ముందే సొంతంగా ఆయా కంపెనీలు భూసేకరణ

అనుమతులు లేకనే భూ సేకరణ..

చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. కంబదూరు మండలం అచ్చంపల్లి, రాళ్లపల్లి, మేళ్లకుంట, రాంపురం, కర్తనపర్తి, చెన్నంపల్లి, నూతిమడుగు, గూళ్యం, రాళ్ల అనంతపురం, పాళ్లూరు, గొల్లపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో వివిధ కంపెనీ ప్రతినిధులు దాదాపు 60 గాలి మరల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. నెడ్‌క్యాప్ నుంచి అనుమతులు లేకనే భూముల లీజుకు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే సొంతంగా ఎకోరియన్ కంపెనీ అంటూ ఓ వ్యక్తి భూ సేకరణకు శ్రీకారం చుట్టారు. గాలిమరల ఏర్పాటుపై సర్పంచ్, రెవెన్యూ, ఆర్డీఓ, కలెక్టర్, నెడ్‌క్యాప్ ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఏ ఒక్క పంచాయతీలోనూ ఇలాంటి గ్రామ సభ జరగలేదు. దీనికి తోడు ఏకంగా 30 ఏళ్ల పంచాయతీ నుంచి లీజు ఒప్పందం కుదుర్చుకునేలా కంపెనీ ప్రతినిధులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పంచాయితీలో ఒక్కో విధంగా భూములకు లీజు ధర నిర్ణయిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. గ్రామాల్లో వాస్తవ భూ ధరలకు విరుద్ధంగా ఒక చోట రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఎకరం లీజు తీసుకుంటే.. మరోచోట రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ధరలు నిర్ణయిస్తున్నారు. ధరల్లో తేడాపై పలు గ్రామాల సర్పంచులు కంపెనీ ప్రతినిధులపై మండిపడుతున్నారు.

ఎన్‌ఓసీల కోసం ఒత్తిళ్లు..



కంబదూరు మండలంలోని పలు గ్రామాల సర్పంచులు కంపెనీ ప్రతినిధుల నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భూ సేకరణ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడుతున్నారు. ధరల వ్యత్యాసంపై సర్పంచులు కంపెనీ ప్రతినిధులను నిలదీస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాధానమూ రావడం లేదు. మరికొందరు సర్పంచులపై గాలిమరల ఏర్పాటుకు స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతో ఒత్తిళ్లు తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కంపెనీ ప్రతినిధుల మోసాలపై త్వరలోనే సర్పంచులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రెండు గ్రామాల్లో మాత్రమే భూ సేకరణ చేస్తున్నాం

కంబదూరు మండలం నూతిమడుగు, రాళ్ల అనంతపురం గ్రామ పంచాయతీల్లో భూసేకరణ చేస్తున్నాం. కంపెనీ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తూ గ్రామ సర్పంచుల తీర్మానాలు తీసుకుంటున్నాం. పంచాయతీ నుంచి అనుమతులు వచ్చాకే భూ సేకరణ చేస్తున్నాం.

– నవీన్, విండ్ పవర్ ప్రతినిధి